కథా నిలయం
3539
శ్రీకాకుళం



మోజులేదు"

సుందరి అవాక్కయింది. అతని మొహంలోకి తీక్షణంగా చూసింది. చూసి చూసి అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ డగ్గుత్తికతో అంది. "ఏవండీ! నిజంగానా? అయ్యో మన పెళ్ళయిన ఈ ఏడాది నుంచీ నేను ఎంత పొరపాటు చేశాను. మీరు నన్ను అవమానిస్తారేమోనని నేనే ముందు మిమ్మల్ని అవమానించాను. అఫెన్స్ ఈజ్ ఏ ఫారమ్ ఆఫ్ డిఫెన్స్ కదా. పాపిష్టిదాన్ని మీ మనస్సు ఎంత గాయపరిచానో మిమ్మల్ని ఎంత క్షోభ పెట్టానో అన్నట్టు మీకు జీతం కట్టేకదా నేనివ్వకపోగా మీ రాబడి పోగొట్టాను. దవుర్భాగ్యురాల్ని. ఛీ,ఛీ! నా పాపానికి నిష్కృతి లేదు. ఇట్లా మీ చేతుల్లో నేను గుటుక్కుమంటే ఎంత బాగుండును. అయ్యో. అయ్యో నా పుట్టింట్లో మీ చేత బెడ్‌పాన్ పెట్టించుకున్నానా?" సుందరి ఉన్న కాస్త ఓపికతోనూ సన్నగా ఏడవటం మొదలు పెట్టింది.

రాగనిధి హఠాత్తుగా ఆమెను మంచం మీంచి ఎత్తి దించి, తన ఒళ్ళో కూర్చో బెట్టుకున్నాడు ఆమె మొహమంతా ముద్దులతో నింపేశాడు అన్నాడు "పాపమూ కాదూ తాపమూ కాదు. ఏదో శాపం! ఆ శాపం ఈ వేళ్టితో తీనిపోయింది. మనం ఒకళ్ళ నొకళ్ళం ఇప్పటికైనా సరిగ్గా అర్థం చేసుకున్నాం అంతేచాలు. మన సంసారం ఇవాళ్టినుంచే మొదలైనట్టు మరింక చావు మాట ఎత్తకు. చివరి కాలంలో మరణం మనిద్దరికీ ఒకేసారి రావాలన్నది నా కోరిక తెలుసా?"

బలహీనంగా ఉన్న ఆ పూచిక పుల్లల్లాంటి చేతులతోనే భర్తను గాఢంగా కౌగలించుకుని వలవలా ఏడ్చేసింది సుందరి.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 15-12-82)

*** *** ***

# కృష్ణా-జయంతి-కోణార్క కథ

తన ప్రాణ స్నేహితుడి పెళ్ళి కొచ్చిన సౌభాగ్యరావు, ఆ పెళ్ళి అయిపోగానే తనిహ బయల్దేరతానన్నాడు. ఆ ప్రాణస్నేహితుడు. 'రేపు మధ్యాహ్నం భోంచేసి కోణార్కకి వెడుదుగాన్లే. ఏలూరెళ్ళటం ఎంతసేపు? ఇవ్వాళ్టికి ఆగిపో" అన్నాడు.

"కనీసం పొద్దున్నే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కన్నా వెళ్ళనీ. నా సెలవులన్నీ నీ పెళ్ళి దెబ్బతో అయిపోయాయి తెల్సా" అన్నాడు సౌభాగ్యరావు అరిచాడు. జుట్టపీక్కున్నాడు. అయినా ఆ స్నేహితుడు తన మాటే చెల్లాలని కూర్చున్నాడు

మౌనం పాటించాడు సౌభాగ్యరావు. మర్నాడు పొద్దున్న తెల్లారకుండానే మూడోకంటి వాడి క్కూడా తెలీకుండా పెళ్ళి పందిట్లోంచి అమాంతం ఆటోలోకి ఆపైన సికింద్రాబాద్ స్టేషన్లోకి వచ్చి పడ్డాడు.

అప్పుడే కృష్ణా ఎక్స్‌ప్రెస్ కూతేసింది, బయల్దేరింది కూడా. హడావుడిగా ఎట్లాగో టికెట్ తెచ్చుకుని,

తనకు ఎదురుగ్గా వచ్చిన పెట్లోకి అతను దూకేశాడు. సీట్లు చాలావరకూ ఖాళీగానే ఉన్నాయి. ఓ త్రీసీటర్‌లో కిటికీవైపు కూర్చుని స్థిమిత పడ్డాడు. సూట్‌కేస్ లోంచి ఏదో మాగజైన్ తీసి చదువుకోవటంలో నిమగ్నమయ్యాడు.

కాజీపేటలో బండి ఆగేటప్పటికి సౌభాగ్యరావు మగత నిద్రలో కలలు కంటున్నాడు. తను కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో మూడు గంటల కల్లా ఏలూరు చేరాట్ట; (కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుంచి గుంటూరు వెళుతుంది ఏలూరు వైపు వెళ్ళదు). సూట్‌కేస్‌లో తిన్నగా బాంకుకెళ్ళి భయంభయంగానే మేనేజర్‌ని విష్ చేశాట్ట, మేనేజర్ ఉగ్రనరసింహం మొహం కుంకం పులమినట్టు ఎర్రబడిపోయింది. అతను కోపంగా వున్నాడు: "సెలవు పెట్టకుండా పొద్దున డ్యూటీ ఎగ్గొట్టి మధ్యాహ్నానికి తక్కుతూ తారుతూ వచ్చి వాలటానికి ఇది పెద్యూల్డు బ్యాంకు సర్వీసనుకున్నావా, చింత పండు బిజినెస్సనుకున్నావా! ఇదివరకు చాలాసార్లు క్షమించాను... ఇప్పుడిహ వదిలేదు లేదు. నీకు ఈ రోజుకు జీతం కట్ రా ముందుకు. మెమో అందుకో, ఆ పైన ఇంటికెళ్ళు."

తను ధైర్యం తెచ్చుకుని కళ్ళు మూసుకుని గబగబా అన్నాడు: "యాదగిరిగుట్ట... బస్సు . పెళ్ళి... నో సార్.... పెళ్ళి బస్సు.... యాక్సిడెంటు...... సెల్ఫ్‌షేవ్‌డ్....నో, నో.......అయామ్ షేవ్‌డ్...బస్ ఇన్ ది హాస్పిటల్....నో, నో, నో....పీపుల్ ఇన్ ది బస్.... సారీ, ఎహ్, అదర్స్ ఇన్ ది హాస్పటల్....దిసీ ఈజ్ ప్రసాదమ్" ఇలా తడబడుతూ అనేసి తను చటుక్కున సూట్‌కేస్ లోంచి పాలిథిన్ పాకెట్ తీసి మేనేజర్ టేబిల్ మీద పెట్టాడు. నానిపండు తనకోసం ప్రత్యేకంగా పాక్ చేసిచ్చిన బండి చక్రాల్లాంటి అరిసెలు అరడజనున్నాయి అందులో.

ఉగ్రనరసింహం తనవైపూ, పాకెట్ వైపూ మార్చిమార్చి చూసాడు. అనుమానంగా చూస్తూ అన్నాడు: "యాదగిరా, యాక్సిడెంటా... అందుకు లేటా, ప్రసాదమా ... అవునూ, యాదగిరిలో అరిసెలు ప్రసాదంగా ఇవ్వటం నేనేనాడూ గమనించలేదే"

తను చటుక్కున అన్నాడు, "యస్సార్, వన్స్ అపాన్ ఏ టైమ్ నో సార్, బట్. ..లేటెస్టుగా ఇస్తున్నారు సార్. ఇటీవల అనకాపల్లి బిజినెస్‌మెన్ పాతిక టన్నుల బెల్లం దేవుడికి కానుక ఇచ్చుకున్నాట్ట సార్.... అది ఖర్చయ్యేదాకా..... అరిసెలూ...."

మేనేజరు తల కిందికి వంచి కళ్ళద్దాల్లోంచి ఇంకా అనుమానంగానే పైకోసారి చూసాడు. పాకెట్ అందుకొని వాసన చూసాడు. కొంచెం ప్రసన్నమయ్యాడు. చిరునవ్వునవ్వాడు. అన్నాడు కర్పూరం వాసన, ప్రసాదంవి లాగానే ఉన్నాయి..." సరే ఇవి ఎట్లాంటి వయితేనేం, నువ్వు మళ్ళీ కనిపించావు, అదే సంతోషం! టైమయింది వెళ్ళు. కౌంటర్ ఓపెన్ చెయ్యి. అండాళమ్మ దగ్గిర పొద్దుటి ఎక్కౌంట్ హాండోవర్ చేసుకో. ఇంకెప్పుడూ యాక్సిడెంట్‌లో పడి రాకు"

"థ్యాంక్యూ... రాను సార్ . ఐమీన్, పడన్సార్" -తను గబగబా కౌంటర్‌వైపు వెళ్ళబోయాడు కుర్చీ తగిలింది చేతికి.

-చటుక్కున మెలకువ వచ్చింది సౌభాగ్యరావుకి. అతని చేతికి తగిలింది కుర్చీకాదు, ప్లాట్‌ఫారం మీద పోతున్న పాన్‌వాలా జంగిడి! అతను చటుక్కున కళ్ళు తెరిచి చూశాడు. కాజీపేట బోర్డు కనబడింది. టైము చూసుకున్నాడు, తొమ్మిది. ఆకలి గుర్తుకొచ్చింది. అరిసెల కోసం సూట్‌కేస్ అందుకోబోయాడు కానీ ఆలోచనొచ్చింది. 'వచ్చిన కల ఉత్తుత్తి కల కాదు. కతత్‌త్తిలాంటి కల. ధృవ నక్షత్రం లాంటిది తనకు దారి చూపుతోంది.

'బండి రైట్ టైమ్‌లో నడుస్తోంది కనక ఒంటిగంటకు తను బెజవాడలో ఉంటాడు. డ్రైవరు బిఫోర్ టైమ్ వెళ్ళాడంటే పన్నెడు గంటలకే చేరిపోవచ్చు. అక్కడ్నుంచి నాన్‌స్టాప్‌లో గంటన్నర- మార్జినల్ లాస్ ఆఫ్ టైమ్ కలుపుకున్నప్పటికీ మూడున్నరకల్లా తను ఏలూరు బస్‌స్టాండ్‌లో ఉండి తీరతాడు. అక్కడ్నుంచి తన అశోక్‌నగర్ బ్రాంచికి పావుగంట. అంటే సాయంత్రం షిప్టు మొదలయ్యే టైముకి తను బాంకులో వుండి తీరతాడు. ఆ పైన ఉగ్రనరసింహం దగ్గర కథని కలలోలాగా జరిపించేస్తాడు. రెండు పూట్లకీ తను సంతకం పెట్టేస్తాడు. ఫినిష్..... మరంచేత తనిప్పుడు ఆ అరిసెల పాకెట్టు ముట్టుకోకూడదు. 'ఓకే, బాస్' సౌభాగ్యరావు అరిసెల పాకెట్టు తీసే ప్రయత్నం విరమించాడు. టిఫిన్ కోసం కిందికి దిగుదామనుకున్నాడు కానీ సమయానికి కిటికీ దగ్గరికి కాఫీ బండొచ్చింది. అతను కాఫీ తాగాడు.

సౌభాగ్యరావుకి మళ్ళీ ఆలోచనొచ్చింది. 'ఏ కారణం చేతనో తను సాయంత్రం షిప్టు క్కూడా బాంకుకు అందుకోలేకపోతే?.... అసంభవం! అట్లా జరగాలంటే ఈ డ్రైవరు గుండె ఆగి చావటమో, వంతెన పేలి కూలిపోవటమో, స్ట్రయిక్ కుర్రాళ్ళు అడ్డరావటమో జరగాలి. వాతావరణంలో ఆ సూచనలేవీ లేదు. నో, నో, నో....న్నో, న్నో! తను సాయంత్రం షిప్టు అందుకొని తీరతాడు'

సౌభాగ్యరావు తృప్తిగా గుండె నిండా ఊపిరి పీల్చుకున్నాడు. లేచి నుంచుని పాకెట్ దువ్వెన్ని తీసి తల దువ్వుకున్నాడు. దువ్వుకుంటూ యాథాలాపంగా అటూ ఇటూ చూశాడు. సీట్ల మధ్య పార్టిషన్ గోడలులేని పెట్టె అది. ఆ కారణంగా పెట్టె అంతా అన్ని మూలలా కనబడుతోంది. ఆశ్యర్యంగా అంతా కలిపి పదిమందికన్నా ఎక్కువ లేరు పెట్టె మొత్తంలో. అతను అనుకున్నాడు. 'ఇదేమిటి, కాజీపేటకే అంతా ఖాళీ అయిపోయిందా? ఇక్కడ్నుంచి విజయవాడకి పదిమందేనా ఇట్లా అయితే ఈ ట్రైన్ వేస్ట్, మియర్ వేస్ట్' అతను మళ్ళీ కూర్చోబోయాడు. కానీ మళ్ళీ 'బండి ఇక్కడ ఇంతసేపాగిందేమిటా' అనిపించిందతనికి. 'ఓసారి కాలు ఝాడిద్దాం' అనుకున్నాడు. పెట్టె దిగాడు. ప్లాట్ ఫారం మీదికి దిగి అటూ ఇటూ చూశాడు. అతని నెత్తిన పిడుగు పడ్డట్టయింది! మతిపోయింది. గుండె ఆగింది.

ఆ పెట్టె తప్ప పట్టాల మీద కనుచూపు మేర దూరంలో ఎక్కడా మరి పెట్టెంటూ లేదు! ఇంజను అసలే లేదు!!

★ ★ ★

అర నిముషానిగ్గాని అతను తేరుకోలేదు. తేరుకున్న తక్షణం అటుపోతున్న 'కిళ్ళీ-బీడి-సిగరెట్' వాలాని నిలేసి అడిగాడు, "పెట్టెలూ ఇంజనూ ఏమయ్యాయి? అని.

వాడు. ఓ వెర్రి మొహాన్ని చూసినట్టు ఎగాదిగా చూసి "కృష్ణా ఎక్స్‌ప్రెస్సా, అదెళ్ళి పోయి చాలాసేపయింది గద్సార్..... దాని స్టాపిక్కడ మూడు నిముషాలే గద్సార్.... చదువుకున్నవారు మీరు కూడా ఇంతలేటుగా వస్తారా.... రెండింటికి కోణార్క ఎక్కండి..... ఒహోయ్, పాన్‌బీడా, పాన్‌బీడా...." అంటూ. వెళ్ళి పోయాడు.

'కృష్ణా ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయిందా. రెండింటికి కోణార్కా!' - రక్తమంతా ఒక్కసారిగా వేడెక్కింది సౌభాగ్యరావుకి. కళ్ళు తిరుగు తున్నట్టనిపించింది. ఎట్లాగో తమాయించుకున్నాడు. ఆ పక్కనే నుంచుని చూస్తున్న జీడిపప్పు వాడు " మీకు లక్కేలేద్సార్. ఇంకో పది నిముషాలు మీరీ పెట్టెలోనే కూర్చునుంటే జాలీగా సింగరేణి ఎక్స్‌ప్రెస్‌లో కాగజ్‌నగర్ వెళ్ళి కాగితం పరిశ్రమ వగైరా చూసొచ్చేవారు... ప్చ్, ఏమిటో " అంటూ చెయ్యి అడ్డం పెట్టి నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు "ఒక్క తన్ను తంతే బాగుండును వీణ్ణి" అనుకున్నాడు సౌభాగ్యరావు వెనక్కు తిరిగి తను నమ్ముకున్న పెట్టె చూసాడు దాని మీద 'సికింద్రాబాద్ - కాగజ్‌నగర్' బోర్డుంది

అట్లా చూస్తుండి పోయిన సౌభాగ్యరావు ఉండి ఉండి, నిట్టూరుస్తూ, నిస్సారంగా, నిస్తేజంగా పెట్టెలోంచి సూట్‌కేస్ తెచ్చుకుని ప్లాట్ ఫారం మీద నడవటం మొదలుపెట్టాడు తాపీగా కూర్చుని చుట్టకాల్చుకుంటున్న కూలి కనబడగానే వాడితో సౌభాగ్యరావు "కృష్ణాలో వచ్చాను అదెళ్ళిపోయింది అర్జంటుగా విజయవాడ వెళ్ళాలి ఏం చెయ్యమంటావ్?" అన్నాడు వాడు, "వరంగల్ వెళ్ళిపొండి అక్కడ పన్నెండింటికి జయంతి ఉంది" అన్నాడు

సౌభాగ్యరావు కాళ్ళీడ్చుకుంటూ స్టేషను బయటికి నడిచాడు. 'అంతా కొత్త. ఎన్నో మాట్లు ఈ రూట్‌లో హైదరాబాద్ వెళ్లినా ఏనాడూ తనిక్కడ దిగిన పాపానపోలేదు ఎట్లా ఇప్పుడు. అనుకున్నాడు అక్కడ ఆటోలున్నాయి'. వాళ్ళు అతన్ని చుట్టుముట్లారు. ఎవణ్ణడిగినా వరంగల్లుకి పదిహేనిమ్మనే వాడే. చివరికి అతను ఎక్కాడు కాజీపేట నుంచి బలార్షా వెళ్ళే రైలుకట్టమీది వంతెన దాటగానే ఆటో, గుర్ర్‌ర్ర్ - ఇష్‌ష్‌ష్ - డబ్‌డబ్‌డబ్ భాడ్ అని చప్పుడుచేస్తూ ఆగిపోయింది "జర దిగండి సార్" అన్నాడు ఆటోవాడు. సౌభాగ్యరావు దిగ్గానే వాడు అవలీలగా ఆటోని తిరగేసేసాడు రెండు రెంచిలు మూడు స్క్రూడ్రైవర్లూ, డజను నట్లు, గ్రీజు డబ్బా వగైరా ముందేసుక్కూర్చుని రిపేరు మొదలుపెట్టాడు.

అయిదు, పది, పదిహేను నిముషాలు గడుస్తున్నాయి. వాడిది అవ్వదు. ఎప్పటి కవుతుందో చెప్పడు. ఓపిక చచ్చిన సౌభాగ్యరావు, "నేనింకో ఆటోలో వెడతాను ఇప్పటికి ఎంతిమ్మంటావ్"? అనడిగాడు. వాడు విసురుగా నుంచున్నాడు : 'గెట్ల పోతరు సార్! జరా ఆగండి. పూరాపంద్రారూపయే దేకర్ జావో (పూర్తిగా పదిహేను రూపాయలూ ఇచ్చివెళ్ళు)" అన్నాడు. వాడి దౌర్జన్యానికి సౌభాగ్యరావు తెల్లబోయాడు. అంతవరకూ ఉన్న చిరాకు అమాంతం పదిరెట్లయి పోయింది 'కనీసం వీణ్ణయినా రెండు తన్నాలి' అనుకున్నాడు మానసికంగా. కానీ రిపేరు అయ్యేదాకా ఇంకో పావుగంట ఆగాడు శారీరకంగా. చివరికి ఆటో బయల్దేరింది. హన్మకొండ ఊళ్ళోకిరాగానే సౌభాగ్యరావు, కుతూహలం ఆపుకోలేక "వెయ్యి స్థంభాల గుడి ఎక్కడయ్యా?" అనడిగాడు వాణ్ణి. వాడు, "తీస్కపొమ్మంటారా?" అంటూ ఆటో పక్కకు తిప్పబోయాడు సౌభాగ్యరావు కంగారుగా, "ఒద్దొద్దులే, వరంగల్లు పోనియ్యి.... అహహ పోనీండి డ్రైవరుగారూ, వరంగల్లు పోనీండి." అన్నాడు.

సౌభాగ్యరావు వరంగల్లు స్టేషను దగ్గర ఆటో దిగేటప్పటికి టైము పదిన్నర. దిగీ దిగ్గానే అతను హడావుడిగా స్టేషను బుకింగ్ కౌంటరు దగ్గరికెళ్ళాడు. అక్కడ జనం చాలా నీతివంతంగా క్యూలో నుంచోమన్నారు. వాళ్ళు తిడుతున్నా సరే తోసుకుంటూవెళ్ళి బుకింగ్ క్లర్క్‌తో ఏదో అనబోయాడు. ఆ క్లర్కు, పక్క కౌంటరుకేసి బొటనవేలు చూపించాడు. సౌభాగ్యరావు అక్కడ్నుంచి బయటకొచ్చి రెండో కౌంటర్లో కెళ్ళి చూసాడు. బస్తాడు నోట్లు ముందేసుకుని లెక్కపెట్టుకుంటున్న అక్కడి క్లర్కు ఆ పక్క కౌంటరు చూపించాడు. సౌభాగ్యరావు అటు కదిలాడు. అది మూసేసుంది. అయితే గుడ్డిలో మెల్లగా అక్కడి అద్దం గుండా చూస్తే లోపలున్న నడివయస్సు స్త్రీ కనిపించింది. ఆమె తన చేతి అద్దంలో చూసుకుంటూ సొగసాలకబోస్తూ కుంకం బొట్టు పెట్టుకుంటోంది ఇతను ఆ అద్దంమీద వ్రేళ్ళతో కొట్టాడు. ఆమె, 'చుట్టూ తిరిగి లోపలికి ర'మ్మన్నట్టు చూపుడువేలితో సైగ చేసింది సౌభాగ్యరావు గేట్‌లోంచి ప్లాట్ ఫారం మీద కొచ్చి ఆవిడున్న బుకింగ్ గదిలో కెళ్ళబోతూ, సూట్‌కేసును గుమ్మంలో పెట్టి, ఎందుకైనా మంచిదని రుమాల్తో మొహం ఓ మాటు తుడుచుకుని, తలనోమాటు నీట్‌గా దువ్వుకుని నవ్వు మొహంతో లోపలికెళ్ళి ఆమె పక్కన ఖాళీ కుర్చీలో కూర్చున్నాడు ఆవిడ అద్దంలో చూసుకుంటూ ఓర చూపుతో ఉంది.

సౌభాగ్యరావు, "నమస్తే మేడమ్ జయంతీ ఈఈఈ...." అన్నాడు

''యెస్ ...!''. ''జయంతీ...''

'' యెస్, నేనే జయంతిని ... ఏం కావాలో చెప్పండి '' విసుగుధ్వనించింది ఆమె గొంతులో.

'' సారీ, మీరు కాదు మాడమ్, నాకు జయంతి ఎక్స్‌ప్రెస్ కావాలి ... ఎప్పుడొస్తుందో ... ''

ఆమె అతని వైపు చురుగ్గా చూసింది. అద్దం టేబిల్ మీద పెట్టి అంది. ''నన్నడుగుతారేంటండీ, నాగపూర్ సెక్షన్ టి.టి.సి ని పట్టుకొని ... గుమాస్తాగారొస్తారు, ఆయన్నడగండి. ఎవర్ని ఏదడగాలో తెలీకపోతే ఎలా...? సంస్కార్‌కే బినా కైసే రహతేహై యేలోగ్'' (సంస్కారం లేకుండా ఎట్టా బతుకుతాన్నారబ్బా ఈ మనుషులు) ఆమె చివాల్న లేచి వాని టీ బాగ్ అందుకుని చిరాగ్గా బయకెళ్ళి పోయింది.

సౌభాగ్యరావు ఆమెని నమిలిమింగేసేట్టు చూశాడు. రెండు మూడు నిముషాల తర్వాత గుమాస్తా లోపలికొచ్చాడు. సౌభ్యారావు అదే ప్రశ్న గుమాస్తా నడిగాడు.

గుమాస్తా, ''బయట బోర్డులో చూడకపోయారా?'' అన్నాడు.

''చూశానండి. అవి ఏప్రిల్ 82 నాటి టైమింగ్సు, ఇది అక్టోబరు 82 కదా. మారి ఉండొచ్చు గదా.''

''అవునవును. కానీ మౌలాలీ నుంచి ట్రాన్స్‌ఫర్ అయివచ్చి నేను నిన్ననే ఇక్కడ చార్జి తీసుకున్నాను ..బెటర్, మీరు బయట టి.సి. రూమ్‌లో ఎవర్నయినా కనుక్కోండి. . వెళ్ళండి''. తననెవరో తాడేసి లాగుతున్నట్టు హడావుడిగా ఆ గుమాస్తా బయటకెళ్ళిపోయాడు.

సౌభాగ్యరావు గేట్లోంచే తిరిగి మళ్ళీ వెనక్కొచ్చి టి.సి. రూమ్‌లోకి చూశాడు. అది శూన్యం! ఎవరూ లేరక్కడ. బుక్కింగ్ కౌంటర్లు రెండింటిలోనూ కొల్లేటి చాంతాళ్ళంతా క్యూలు తయారయున్నాయి 'ఆహా ఎవణ్ణడగాలి! ఇప్పుడే అయిచావాలా ఈ వెధవ. ఆకలికూడాను. ఇదుగో ఇదుగో వీడెవడో నానడకకు అడ్డొస్తున్నాడు. ఈడ్చి ఈడ్చి వీణ్ణి నాలుగు తన్నేస్తాను, శని ఒదిలిపోతుంది. ఒరేయ్ సౌభాగ్యం, దౌర్భాగ్యం యూఆర్ ఏ డర్టీ రెచెడ్ ఫ్లై ఇన్ ది ఫ్లేమ్'

...ఈసురో మంటూ సౌభాగ్యరావు స్టేషన్ బయటకు నడిచాడు. రూపాయిన్నర రిక్షా బజారు సెంటరుకి చేరాడు. హోటల్లో భోజనానికి కూర్చున్నాడు. ప్రొప్రయిటరు ఇతని దగ్గర కొచ్చి కబుర్లు మొదలెట్టాడు. చివరికి, ''ఆటోకి పదిహేనిచ్చారా, ఎక్స్‌ప్రెస్ బస్సు రూపాయి ఇరవై పైసలేగదండి, అయినా . ఇవ్వాళ జయంతి లేదనుకుంటాను సార్'' అన్నాడు. సౌభాగ్యరావుకి అన్నం కొరబోయింది నీళ్ళు తాగాడు. దగ్గొచ్చింది. కక్కుకున్నంత పనయి సర్దుకున్నాడు. ప్రొప్రైటరు అంతటితో ఊరుకోక, ''ఏం చేస్తార్ సార్, పాపం, కోణార్క్‌లో వెళ్ళండి'' అనికూడా అన్నాడు. సౌభాగ్యరావుకి ఇంక అన్నం సయించలేదు. కంచం లోనే చెయ్యి కడిగేసుకొని ఆతృతగా మళ్ళీ రిక్షా ఎక్కాడు. స్టేషన్ కొచ్చి పడ్డాడు

స్టేషన్లో ఏదో బండి ఆగుంది. జనం అట్టేలేరు. హడావుడిలేదు. ఏదో పాసంజరై ఉంటుంది అనుకున్నాడు అతను. గేట్లో ముగ్గురు టి.సి లు నుంచుని మాట్లాడుకుంటున్నారు. 'ఎందుకైనా మంచిదని సౌభాగ్యరావు వెళ్ళి వాళ్ళల్లో ఒకణ్ణడిగాడు. '' సార్. ఇవాళ జయంతి ఎక్స్‌ప్రెస్సుందా, ఎన్నింటి కొస్తుంది?'' ఆ టి.సి ఇతన్ని ఎగాదిగాచూసి, ''ఇదేంటండీ, ఎదురుగుండా! జయంతి కాక అజంతా అనుకున్నారా!'' (అజంతా ఎక్స్‌ప్రెస్ ఈ రూటు లోకి రాదు.) అంతే సౌభాగ్యరావు ముందుకు ఒక్కదూకు దూకి ఎదురుగుండా ఉన్న పెట్టె ఎక్కబోయాడు. వెంటనే చటుక్కున ఆగిపోయాడు. వెనక్కినడిచి ఆ టి.సి నే ''సార్. విజయవాడలోపల డిటాచ్ అయ్యే బోగీలేవయినా ఉన్నాయా?'' అనడిగాడు.'' ఏం, ఎంచక్కా ఆ పెట్టెతోనే మీ వూరు వెడదామనుకుంటున్నారా? అట్లాంటి పెట్టెలేవీలేవు. వెళ్ళవయ్యా

బండి బయల్దేరుతోంది" మళ్ళీ చూపుల్లో కోపం కక్కాడు సౌభాగ్యరావు కానీ వెంటనే ఒక్క ఉదుటున బండి ఎక్కాడు - కాదు, బండిలోకి దూకాడు వెంటనే బండి కదిలింది. స్పీడందుకొంది

* * *

సీట్లో కళ్ళు మూసుక్కూర్చుని కాస్త కాస్త ప్రశాంతపడుతున్న సౌభాగ్యరావుకి ఆలోచన్లొస్తున్నాయి "ప్రభువు దయామయుడు! ఎట్లాగోట్లా మళ్ళీ బండి ఎక్కించాడు ఈ సస్పెన్సూ, ఈ టెన్షనూ, అసలివ్వాళ కొంపకు చేరతానా అనే దిగులూ, ఓహ్ ! టెర్రిఫిక్ ! అయితే . ఇప్పుడు తను బాంకు టైంకు చేరతాడా అని! చేరక ఏం చేస్తాడు? కొంచెం ఆలస్యంగా నైనా చేరి తీరతాడు. ."

బండి నెక్కొండ స్టేషను దాటుతుండగా టి.టి సి వచ్చాడు అటువెడుతూన్న వాడల్లా పక్కకిచూసి, చటుక్కున ఆగి, సౌభాగ్యాన్ని అడిగాడు :

"వరంగల్లులో ఎక్కారా?"

"అవును". "ఎక్కడికెడుతున్నారు?" . "విజయవాడ"

టి టి సి. తలెత్తి కనుబొమలు ముడుస్తూ చూశాడు

"విజయవాడా? విజయవాడకు వరంగల్ నుంచి ఎలౌ చెయ్యరు "

సౌభాగ్యరావు మొహం హఠాత్తుగా మాడిపోయింది నూతిలోంచి మాట్లాడుతున్నట్టు అన్నాడు. "మీరు చెప్పేది నాకర్థం కావట్లేదు. ఎందుకు ఎలౌ చెయ్యరు?"

"ఎందుకేంటి, అది రూలు! అయినా వరంగల్లులో ఏడెనిమిది నిమిషాలాగింది కదా, చెప్పి ఎక్కకూడ్లేదా? మీ ఇష్టమేనా?" విసుగ్గా అన్నాడు టి టి సి

"చెప్పెక్కే అవసరమేంటి, టికెట్ తీసుకున్నప్పుడు?"

"టికెట్ తీసుకున్నారా విజయవాడకా, ఎవడండీ ఇచ్చింది, తియ్యండి"

సౌభాగ్యరావు రీవీగా తన పాకెట్‌లోంచి టికెట్ తీసి చూపించాడు. టి.టి.సి. దాన్నిపరిశీలించాడు. అన్నాడు, "సికింద్రాబాద్ నుంచి ఒస్తున్నారా... ఓహో, కృష్ణాలోనా . .. బ్రేక్ ఆఫ్ జర్నీ ఈ కాస్త దూరానికి ఒప్పుకోరే, వరంగల్‌లో ఎలా దిగారు?"

"బ్రేకాఫ్ జర్నీ కాదు పొద్దుట ఎక్కడమే పొరబాటున కాగజ్‌నగర్ బోగీలో ఎక్కాను కాజీపేటలో తప్పు గ్రహించాను అప్పటికే కృష్ణా వెళ్ళిపోయింది ... ఇవ్వాళ డ్యూటీ కందుకోవాలి .. అందుకని .. హడావుడిగా వచ్చి ఎట్లాగో దీన్నందుకున్నాను "

"మంచిది మీరు చాలా చురుగ్గా హడావుడి పడగలరని తెలుస్తోంది సంతోషం ... కానీ, దీని విషయం చూశారూ, ఇది జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ నిజాముద్దీన్ టు బలార్షా టు వరంగల్ టు విజయవాడ టు మంగుళూరు దీంట్లో అయిదొందల కిలోమీటర్లకి పైబడిన దూరాలకే టిక్కట్లిస్తారు అదీ విషయమండి! మీ టికెట్ ఈ ట్రెయిన్‌ది కాదు గనక చెల్లదు మీరు మళ్ళీ టికెట్ తీసుకోవాలి వరంగల్‌నుండి అయిదొందల కిలోమీటర్లంటే? " టి టి సి. తన బ్రీఫ్ బాగ్‌లోంచి పుస్తకం తీసి చూస్తూ మళ్ళీ అన్నాడు. "యుసీ, గూడూరు, గూడూరుకు తీసుకోవాలి ముప్పయ్ అయిదూ ముప్పయ్ అయిదూ డెబ్బై రూపాయలు. ఎవర్నీ అడిగి తెలుసుకోకుండా, ముందుగా చెప్పాపెయ్యకుండా బండి ఎక్కెయ్యటమే అనుకున్నారా?..... దబ్బిస్తే రశీదిస్తాను."

సౌభాగ్యరావు మొహాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు అతను టి టి సి. వైపు మిర్రి మిర్రి

చూస్తూండి పోయాడు అటువైపొచ్చిన ఇంకొక టి టి సి ఈ టి టి సి ని ఇక్కడ చూసి ఆగిపోయి ఇతన్తో "డ్రైవర్ రోగ్ క్యాబోల్ రహే, షునే క్యా భాయ్?" అన్నాడు చ(రున ఈ టి టి సి లేచాడు "చలో యార్, ఆ రహా" అన్నాడు ఇద్దరూ కలిసి హడావుడిగా ఇంజన్ వైపు వెళ్ళిపోయారు

అంతవరకూ ఆ పక్కన టీ అమ్ముకుంటున్న ఆ ట్రైన్ అటెండెంట్ కుర్రాడు సౌభాగ్యరావు వైపు తిరిగి "కేసు రాశాడా సార్?" అన్నాడు

సౌభాగ్యరావు బేలగా మొహం పెట్టాడు వాడు మళ్ళీ అన్నాడు "లాభం లేద్సార్. దొరికితే వదల్డు మహారూల్సు మనిషి.. డబ్బివ్వకండి సార్, మండిపడతాడు మీరు కోణార్క ఎక్కాల్సింది ..ఏంటో!. పాపం ! ....ప్చ్" వాడు వెళ్ళిపోయాడు

★ ★ ★

'తోమని పళ్ళాల వాడా
అడుగడుగా దణ్ణాల వాడా
ఆపద మొక్కుల వాడా
వడ్డికాసుల వాడా

దురిత దూరుడా, ఆది దేవుడా, వెంకట రమణా, గోవిందా, గోవింద' - రేడియోలోంచి వస్తున్న గానం చెవుల్లో పడి, సౌభాగ్యరావు మనస్సు అప్రయత్నంగా ఏడుకొండలవాడి మీదికి మళ్ళింది. అతననుకున్నాడు. "స్వామీ నన్ను దుఃఖ పెడుతున్నావా! ఈ ముండమోపి ఆరుగంటల బెజవాడ ప్రయాణంలో అడుగడుగునా నాకు పరీక్షలూ, కష్టాలూనా. ఈ కాస్తలో ఇన్ని మలుపులా,.... సికింద్రాబాద్‌లో ఎక్కినపుడు నాకు పక్క చూపు, సూటి చూపు తప్ప పై చూపనేది బొత్తిగా లేకపోవటమేమిటి బయటి చూపనేదయినా లేకుండా కాజీపేట స్టేషన్లో అంతసేపు పెట్టెలోనే కూర్చోవట మేమిటి! సరేనయ్యా వరంగల్లులో ఈ దిక్కుమాలిన బండి ఎక్కేటప్పుడైనా టి టి.సి.కి కనీసం కనిపించైనా ఎక్కాలనే దూరపు చూపు కూడా లేకపోవడమేమిటి? ఇప్పుడిక్కడ ఛస్తే నేను వెళ్ళబోనని గూడూరుకి టికెట్ తీసుకోవలసి రావటమేమిటి? ఉన్నదీ పోయె ఉంచుకున్నదీ పోయె అన్నట్టు డబ్బుతో బాటు పరువు కూడా పోతోందే. శ్రీరామచంద్రా అసలు నువ్వున్నావా? ఉంటే ఏమిటి నాయనా ఈ మాయ నేనేం పాపం చేసానని నాకీ శిక్ష!... వీడు డబ్బు తీసుకోక్ట జీళ్ళపాకంట వాడి శ్రాద్ధంట! ప్రతి ఉద్యోగీ ఇంతింత స్ట్రిక్టుగా ఛస్తే జనం బతికేదెలాగ. దేశం ఇప్పట్లో బాగుపడదు కాబోలు. నన్నీ పరిస్థితిలో ఇరికించిన ఓ ప్రభువా, నువ్వింత దయారహితుడవని అనుకోలేదు. నీ ఇంద్రజాలం నా నాడీబలాన్ని స్తంభింపచేస్తోంది. ఏమిటింక దారి'....' క్రమంగా సౌభాగ్యరావుకి కళ్ళు చెమ్మగిల్లాయి. మొహం వాడిపోయి విచారం అలుముకుంటోంది పర్సు తీశాడు. మిగిలిన డబ్బు లెక్క చూసుకున్నాడు ఇరవై తొమ్మిది రూపాయల ముప్ఫై అయిదు పైసలు! కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి డోర్నకల్ వెళ్ళిపోయి చాలాసేపయింది. బండి నాగల్వంచ దాటుతుండగా కోపంగా దూకుడుగా వచ్చాడు మొదటి టి టి సి. సౌభాగ్యరావు పక్కన కూర్చుంటూ అన్నాడు "బాస్టర్డ్! నన్ను అల్లరి పెట్టటానికి, బండిలో టికెట్ లేకుండా ఆరుగురెక్కారనీ, నాకు డబ్బిచ్చారనీ డ్రైవర్ గుసగుస లాడుతున్నాట్ట. ఎందుకయ్యా అంటే నేను వాడి ఫ్రెండ్‌ని రామగుండంలో ఊరికే ఎక్కించలేదని కోపం? నేను పైస తిననని వాడికి తెలుసు సార్, చాలామంది ఉద్యోగులు దిగజారిన వాళ్ళే, కాదన్ను. కానీ అంతా కరప్టేనంటారా? ఇన్‌ఫాక్ట్ మీ ఆఫీసులో ఉన్న వాళ్లంతా లంచగొండులే నంటారా ? బైదిబై మీరేం చేస్తున్నారు సార్?"

"బాంక్ కాషియర్‌ని। ఏలూర్లో" "మీ పేరు ?"

"సౌభాగ్యరావు" "నా పేరు భీమారావు. సరే మీ విషయం కొంచెం క్రిటికల్ రూల్సు ప్రకారం ఏం చెయ్యాలో చెప్పాను గదా కాదంటే అసలు టికెట్ అంటూ ఉంది కాబట్టి చూసీచూడనట్టు"

చటుక్కున కొంచెం బతిమాలుతున్న ధోరణిలో సౌభాగ్యరావు అన్నాడు "ప్లీజ్ కొంచెం అర్థం చేసుకోండి నాకు సెలవల్లేవు. ఈపూట ఈవెనింగ్ డ్యూటీకి అందుకోకపోతే నాకు చాలా చికాకులున్నాయి. మీకు డబ్బు కట్టాలన్నా డెబ్బయి నా దగ్గిరలేదు"

"మీ దగ్గర డబ్బులేదని రూల్సు జాలి చూపించవు గదా"

"అదేసార్, రూల్సు కఠినంగా ఉన్నప్పుడు మనిషికి మనిషి సాయం చేసుకోకపోతే ఎట్లా?"

భీమారావు సౌభాగ్యరావు కళ్ళల్లోకి లోతుగా చూసాడు? అయిదారు క్షణాలు నిశ్శబ్దంగా ఉండి తర్వాత పైకి చూస్తూ సాలోచనగా అన్నాడు : "అట్లా అంటారా.. సరే, నేను మీకు సాయం చేసాననుకోండి, మీరు నాకేం చెయ్యగలరు ?"

"మీకు నేనేం చెయ్యగల్నండి! రెవెన్యూ వాణ్ణికాను, ప్రిన్సిపాల్‌ని కాను, కనీసం నాకు కిళ్ళీకొట్టయినా లేదు."

భీమారావు మొహంలో చిరునవ్వు తొంగి చూసింది "మనిషికి మనిషంటున్నారు, ఏం చెయ్యలేనంటున్నారు, ఎట్లాగండీ!"

"..........." భీమారావు మొహం హఠాత్తుగా గంభీరంగా మారింది. చటుక్కున నుంచున్నాడు. "సరే నాతో రండి" అంటూ పెట్టెచివరికి దారి తీసాడు

సౌభాగ్యరావు బిక్కచచ్చిపోయి మెల్లగా లేచాడు. అతని వెనకాల పడ్డాడు.పెట్టెకీ పెట్టెకీ మధ్య ఉండే నడవా ('వెస్టిబ్యూల్')లోంచి దాటబోయేసరికి సౌభాగ్యరావుకి భయం వేసింది. కారణం, అక్కడి జాయింటు ప్లేట్లు కిందికీ పైకీ ఊగుతున్నాయి, ఎట్లాగో దాటాడు మొదటి పెట్టె, రెండో పెట్టె... అతను టి టి.సి. భీమారావు కెనకాలపడి అట్లా పోతూనే వున్నాడు. అతనికి అయోమయంగా ఉంది. 'ఎందుకు రమ్మన్నాడు తన్ని? ఎక్కడికి తీసికెడుతున్నాడు? తన చేత చొక్కా, ఫాంటూ, వాచీ, ఉంగరమూ, ఊడతీయించడు గదా ఖర్మ!... ఓహో, అతని నిజాయితీ గురించి డ్రైవరుకు తనచేత చెప్పిస్తాడు కాబోలు' ... 'ఏంటోగోల, అర్థమయి చావట్లేదు' అనుకున్నాడు. అతనికి దోవలో వరండాల్లో సూట్ కేసులు, బెడ్డింగులు వగైరాలు గుట్టలు అడ్డొస్తున్నాయి. గులాబీల అంట్లున్న కట్టొకటి అడ్డొచ్చి అతని పాంటు చిరిగి పోయేంత పనైంది. ఇంకోచోట పసివాళ్ళ మూత్రమో, నీళ్ళోకాని నిలువుగా ప్రవహిస్తోంది. వాటి మీంచి గెంతుకుంటూ పోవటం అతనికి తప్పని సరైంది. అతనికి చిన్ననాటి పద్యం ఒకటి గుర్తుకొచ్చింది

అడవులును పారునేరులు
బిలములు శైలమ్ములెసగ బీడుల నెన్నో
వడివడిగా దాటి పోవుచు
మృడనాథుని కొల్చు కోర్కె యేగెన్నరుడున్

.... ఈపద్యం కవిగారు ఎవరోగాని, మహానుభావుడు తనిప్పుడీ స్థితిలో కొస్తాడని ముందే ఊహించి ఆ నాడు తెలుగు పుస్తకంలో కెక్కించుంటాడు ?"

అయిదో నడవాలో పరిస్థితి అతి వీర భయంకరంగా వుది! చెడుగుడులో కూతకెళ్ళిన కుర్రాడు

ఎగురుతూ ఎడాపెడా చెడతిరిగేసి నట్టు జాయింటు ప్లేట్లు రెండూ దేని ఇష్టం వచ్చినట్టు అది పైకి కిందకీ, అటుపక్కకీ ఇటు పక్కకీ తెగ ఊగిపోతున్నాయి, 'ఎన్నోసార్లు ప్రయాణించానుగాని ఇంత ఊపు నేను ఏ ట్రైన్‌కూ చూళ్ళేదు' అనుకున్నాడు సౌభాగ్యరావు దడుసుకున్నాడు కూడాకొంచెం. వాటిని చూడగా చూడగా అతనికి క్రమంగా కళ్ళు తిరగటం మొదలు పెట్టాయి. అక్కడ పెట్టెకానుకుని అతను మూతకళ్ళతో నుంచుండి పోయాడు రివ్వున ముందుకు దూసుకెళ్ళిన భీమారావు నిముషం తర్వాత సర్రున వెనక్కొచ్చాడు చూశాడు "ఇదా. ఫర్వాలేదు రండి... దూకెయ్యండి" అంటూ తన చెయ్యి అందించాడు. సౌభాగ్యరావు ఆ చెయ్యి అందిపుచ్చుకుని అవతలికి దూకేశాడు. ఎదురుగుండా భగభగ మండే పొయ్యిలూ, పప్పు వండుతూ వంటవాళ్ళూనూ భీమారావు "పాంట్రీకార్‌లో కొచ్చాం.. పోనీ ఇక్కడే కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం లెండి" అన్నాడు కౌంటర్ దగ్గర నుంచుని 'రెండు స్ట్రాంగ్ కాఫీ" అన్నాడు. అటెండెంట్ చేతిలోంచి కప్పులందుకొని ఒకటి సౌభాగ్యరావుకిస్తూ "తీసుకోండి" అన్నాడు.

సౌభాగ్యరావుకి అయోమయమై పోయింది. భీమారావువైపు అనుమానంగా చూస్తూ కప్పు అందుకున్నాడు. రెండు మూడు గుటకలు అయ్యాక నవ్వుతూ అన్నాడు భీమారావు :

"మీరు మళ్ళీ టిక్కెట్టు తియ్యక్కర్లేదు చెప్పానుగా రూలు పొజిషను. మీ విషయం వదిలెయ్యండి.... ఇహపోతే.." భీమారావు ఇంకో గుక్క పీల్చాడు, మింగాడు, గొంతు సవరించుకున్నాడు. పదిక్షణాలు గడిచాయి.

సస్పెన్స్ భరించలేక సౌభాగ్యరావు "చెప్పండి సార్" అన్నాడు.

"ఆఁ, ఏం లేదు మీరు తలుచుకుంటే నాకో సహాయం చెయ్యగల్రు ... మీకు పీర్‌లెస్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ గురించి తెలుసనుకుంటాను!"

"ఎప్పుడో ఏదో విన్నాను. కానీ... బాగా తెలీదు"

భీమారావు ఆశ్చర్యంగా మొహం పెట్టాడు "అరె, బాగా తెలీకపోట మేంటండి! బ్రహ్మాండంగా పైకొస్తున్న కంపెనీ! అనేకమంది నిరుద్యోగులకు, చిరుద్యోగులకు, అల్పాదాయ వాళ్ళకి వేలూ, లక్షలూ, సంపాదించి పెడుతున్నది కదా!.... పోన్లెండి, వినండి. ఇది చిట్‌ఫండ్ కంపెనీయే అనుకోండి. కానీ ఎల్.ఐ.సి.కి దీనికీ చాలా పోలికలున్నాయి... ఎల్.ఐ.సి.లో ఎటువంటి మరణానికైనా హామీ సొమ్ము ఇస్తారు. ఆ సొమ్ముతో బాటు అంతవరకూ కట్టిన సొమ్ము కూడా ఇచ్చేస్తారు. ఎల్.ఐ.సి.లో కట్టాల్సిన ప్రీమియాల సొమ్ముకన్నా ఇందులో కట్టాల్సిన వాయిదాల సొమ్ము తక్కువ. ఎల్.ఐ.సి.లో లాగా ఇందులో డాక్టరు పరీక్ష అవసరంలేదు. ఎల్.ఐ.సి. లాగా ఇది గవర్నమెంటుది మాత్రం కాదు. అదొక్కటే దీనికున్న ఆక్షేపణ అయినా ఈ కంపెనీ ఉత్తరభారతంలో బాగా పాకింది. ఇంకా పాకుతోంది. ఇందులో ఏజంట్లుగాచేరి సర్టిఫికెట్లు అంటే పాలసీలనుకోండి - అమ్మినవాళ్ళు కమీషన్ పేరుతో డబ్బు బాగా సంపాదిస్తారు ప్రతి ఏడూ ప్రమోషన్ మీద పైకిపోవచ్చు. ఏజంటు - స్పెషల్ ఏజంటు-సబ్ఆర్గనైజరు - ఇట్లావుంటాయి ప్రమోషన్లు. కష్టపడి పనిచేస్తే అయిదేళ్ళల్లో ఇన్‌స్పెక్టరవ్వవచ్చు. ఇక ఇన్‌స్పెక్టరు సంపాదించేది - ఒక్క కమీషన్ల మీద మాత్రమే - నెలకి ఇరవై వేలు తెలుసా. ఇవికాక ఎన్నో ప్రోత్సాహక బహుమతులుంటాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ పీర్‌లెస్ కంపెనీలో డబ్బు దాచుకున్నవాడికీ ఏజంటుగా పనిచేసినవాడికీ జాతకం తిరిగిందే అనుకోండి"

"నన్నిప్పుడు ఒక సర్టిఫికెట్ తీసుకోమంటారు, అంతేనా? .. నాకొచ్చే పన్నెండొందల్లోనూ కట్టింగ్‌లూ, ఆర్ డి.లూ పోనూ చేతికొచ్చేది ఎనిమిదొందలు! . సారీ సార్ కొత్తవేమీ కట్టలేను."

పక పకా నవ్వాడు భీమారావు, "నోనో మీరు సర్టిఫికెట్ తీసుకోవటం కాదు నాక్కావలసింది. నా

మిసెస్ ఇప్పుడు స్పెషల్ ఏజంటుగా పనిచేస్తోంది. పదిహేను మంది ఏజంట్లను ఆమె చూపిస్తే ఆమె సబ్-ఆర్గనైజర్‌గా ప్రమోట్ అవుతుంది. ఇప్పటికి పధ్నాలుగు మందిని రిక్రూట్ చేసుకోగలిగింది ఆవిడ. మీరు మీ మిసెస్ పేరు మీద ఆవిడ దగ్గర ఏజన్సీ తీసుకుంటే పదిహేను మంది పూర్తవుతారు. దటీజ్ మై రిక్వెస్ట్.''

సౌభాగ్యరావు ఇబ్బందిగా మొహం పెట్టాడు. అన్నాడు. ''సేల్సుమాన్‌గా నేను బిజినెస్ చెయ్యలేనేమో సార్... ఏదో కదలకుండా కుర్చీలో కూర్చుని ఉద్యోగం చేసుకొనేవాణ్ణి! 'అమ్మా, బాబూ, అన్నా పాలసీ తీసుకోండి' అంటూ వీధిలో పడలేనండి.''

''అమ్మమ్మా అట్లా అనకండి!.. బాంకు వాళ్లంటే సామాన్యులా ! పరిచయాలు, పరపతి, ప్రతిష్ఠ, డబ్బు- అన్నీ మీవి!... మీరింక ఇంకేం చెప్పకండి. మీరు దిగాలేగాని అద్భుతంగా బిజినెస్ చెయ్యగల్రు! ఏడాది తిరిగేసరికి పండంటి స్పెషల్ ఏజంటు అయిపోగల్రు!..''

''సారీ సార్, మీరంటున్న హోదాలేమిటో నాకు తెలీవు. ప్రజాసేవకోసమే మేమున్నాం అని మేము అంటూంటాం కాబట్టి బాంకుకొచ్చిన ప్రతివాడూ తనకు అక్కడొక హక్కున్నట్లు ప్రవర్తిస్తూంటాడు. మాకున్న ప్రత్యేకతలేవిటో చెప్పండి! ఆఫీసరుగారి గేదె అని ఆమధ్య విపులలో ఒక కథ పడింది. చదివుంటా రనుకుంటాను. అడ్వాన్సుల రికవరీల్లో మాపరిస్థితి అంత చికాగ్గా ఉంటోంది. ఇంక ఫోర్జరీలు, దోపిడీలు దొంగతనాలు వగైరాల వల్ల రిస్కు పెరుగుతోంది, ఉన్న పరువూ పోతోంది. సాయంత్రం నేను ఇంటికెళ్ళటం ఆలస్యమైతే ఏ కేసులో నేను ఇరుక్కున్నానో అని నా మిసెస్ బెంగ పెట్టుకుంటూంటుంది ! ఈ స్థితిలో నేను ప్రైవేట్ బిజినెస్ చెయ్యటం - ఇంపాసిబుల్ !''

ఇద్దరూ కప్పుల్ని కౌంటరు మీద పెట్టారు. సౌభాగ్యరావు డబ్బుతీసి ఇవ్వబోయాడు. అటెండెంట్ డబ్బు తీసుకోలేదు. ''మాదగ్గరా, మా అతిధుల దగ్గరా డబ్బు తీసుకోరు వీళ్ళు'' అన్నాడు భీమారావు.

ఇద్దరూ పక్కకొచ్చారు. భీమారావు అన్నాడు. ''ఆల్‌రైట్ సర్, వదిలెయ్యండి .. మనం బిఫోర్ టైం, అంటే మూడున్నరకే విజయవాడ వెళ్ళిపోతాం. మీరు డ్యూటీకి అటెండ్ అవ్వగలరనుకుంటాను... నేను ముందుకెళతాను మీరు వెనక్కి వెళ్ళిపోగల్రుగదా! బై!'' భీమారావు హడావుడిగా వెళ్ళిపోయాడు.

సౌభాగ్యరావు మళ్ళీ గుండెలు చేత్తోపట్టుకుని పెట్టెలన్నీ దాటుకుని వెనక్కి తన సీట్లోకొచ్చి పడ్డాడు. టి.టి.సి భీమారావు పట్ల స్నేహభావంతో అతని మనస్సు నిండిపోయింది. 'వండర్‌ఫుల్! తనదగ్గిర డబ్బు పిండాల్సిన వాడు ఎదురు కాఫీ ఇచ్చి పంపించాడు. గొప్ప కేసు' అనుకున్నాడు అతను.

★ ★ ★

గంగినేనికీ కొండపల్లికీ మధ్య మనిషిలేని లెవెల్ క్రాసింగ్ దగ్గర రైలు ఆగింది. చాలా మంది బండి దిగారు. సౌభాగ్యరావుకూడా దిగాడు. రెండేళ్ళ పిల్లడి కాలు పట్టాల మధ్య ఇరుక్కుపోయుంది. వాడు ఆకాలు లాక్కోలేక కూర్చుండిపోయి ఏడ్చి ఏడ్చి ఎక్కిళ్ళలోకి దిగాడు. అక్కడే వాడితండ్రీ, ఇంకా అయిదారుగురూ విశ్వప్రయత్నం చేస్తున్నారు, ఆ కాలు బయటికి తియ్యటం కోసం. డ్రైవరు డీజిల్ ఆయిల్ తెచ్చి పిల్లాడి కాలుమీదపోసి ఒడుపుగా లాగాడు. కాలు బయటకొచ్చేసింది. రైలు బయల్దేరింది.

ఈ అరగంట లేటూ సౌభాగ్యరావుకు ఆరుయుగాల లేటులాగా అనిపించింది. అతననుకున్నాడు. రెండున్నరకి విజయవాడలో హౌరా వెళ్లే ఈస్టుకోస్టుంది. అది లేటయితే బావుణ్ణు దాన్నందుకోవచ్చు. ఏలూరుపేటలో దిగొచ్చు కానీ... అది సాధారణంగా.. లేటవదు. కనక తనకింక నాన్ స్టాప్ బస్సేగతి! బండి దిగి తొందరగా బస్స్టాండుకెళ్ళిపోవటం ఉత్తమం.

టైము నాలుగవుతూండగా బండి బెజవాడ ప్లాట్‌ఫారంమీద కెళ్ళి ఆగింది సౌభాగ్యరావు కిందికి దిగాడో లేదో టి టి సి భీమారావు హఠాత్తుగా ఎక్కడ్నుంచో ప్రత్యక్షమయ్యాడు అన్నాడు "హలో సార్, జస్టేమినిట్!... ఇందాక వివరంగా చెప్పలేదు. ఏజంటుగా మీరు ఫస్టియర్‌లో పన్నెండువేలు కలెక్షను చూపించారనుకోండి, మీకో గోల్డుకప్పుతో పాటు, ఏడున్నర శాతం స్పెషల్ కమీషన్ ఇస్తారు యాభైవేలు చేస్తే టెలివిజన్ సెట్టూ, లక్షచేస్తే స్కూటరు ఇస్తారు ఫీల్డాపీసరుగా మీరురిటైరయితే డెఫినిట్‌గా అవుతారనుకోండి - గ్రాట్యుయిటీ, ఎక్స్‌ట్రా కమీషన్ వగైరాలు కూడా వస్తాయి. . మీ భార్యపేర ఏజన్సీ విషయం ఆలోచించండి..."

"నాది బిజినెస్ టెంపర్‌మెంటు కాదని చెప్పానుగదండీ! ప్రతి అడ్డమైనవాణ్ణీ నేను బ్రతిమాలలేను. నన్నొదిలెయ్యండి, ప్లీజ్... వస్తాను."

భీమారావు సౌభాగ్యరావు భుజంమీద చెయ్యేసాడు. "జస్ట్ వన్ పాయింట్!.... మీ ఊళ్ళో సామ్మాచారి అని వున్నాడు చూసారా, మధులత హోటల్ ఎదురుగుండా?.. అతను టి.టి.సి. చేస్తూ రిజైన్ చేసి ఇందులో ఫీల్డు ఆఫీసర్‌గా రిటైరయ్యాడు, తెలుసా? ఈ డబ్బుతో కట్టిందేనండీ ఆ మూడంతస్తుల మేడ! ఇంకా...మీ కౌన్సిలర్ ఖామేనీ! బస్‌స్టాడు భూతలింగం, లారీ ఓనరు లంపట్‌మల్‌జైన్ ఇంకా, మీ ఊళ్ళో ఎందరో ఉద్యోగులూ నిరుద్యోగులూ షేర్లూ కార్లూ ఎట్లా సంపాదిస్తున్నా రంటారు..."

విసుగ్గా తన భుజం మీంచి భీమారావు చెయ్యి తీసేస్తూ సౌభాగ్యరావన్నాడు. "నాకు బస్సు టైమవుతోంది నన్ను వెళ్ళనిస్తారా?"

"డెఫినిట్లీ, వైనాట్... ఎందుకైనా మంచిది, నా హౌస్ అడ్రస్ తీసుకోండి మీరు ఎప్పటికోప్పటికి పీర్‌లెస్ ఏజన్సీ తీసుకోవాలనుకొని తీరతారు. నాకు తెల్సు అప్పుడు మాత్రం నన్ను జ్ఞాపకం ఉంచుకోండి, ప్లీజ్! జస్ట్, జస్ట్ ..." భీమారావు తనబాగ్‌లోంచి తెల్లకాగితం ముక్కతీసి తన అడ్రసు దానిమీద గబ గబా బరికి, సౌభాగ్యరావు చేతిలో కుక్కాడు.

సౌభాగ్యరావు విసురుగా కదిలాడు. వెనకనుంచి భీమారావు అంటున్నాడు.

"మీ కలెక్షన్స్ విశాఖపట్టణంలో నేను కట్టించగలనండోయ్, మీరెళ్ళక్కరలేకుండా! నా దగ్గిర తీసుంటే అదీ బెనిఫిట్.."

వెనక్కు తిరిగి చూడనుకూడా చూళ్ళేదు సౌభాగ్యరావు ఓవర్‌బ్రిడ్జి మెట్లెక్కబోతూ ఎందుకయినా మంచిదనుకొని కూలీనడిగాడు. ఏలూరుకు ఇప్పుడేదైనా ఎక్స్‌ప్రెస్సుందా? అని.

వాడు "అదేంటండీ ఈస్టుకోస్టు ! నాలుగో నెంబరు మీదుందిగందా!" అన్నాడు.

సౌభాగ్యరావు పరుగుతో - కాదు, ఎగురుతూ - అవతలివైపుకు వెళ్ళి చూసాడు అక్కడ బండీ ఏదీలేదు. కానీ దూరంగా హోమ్‌సిగ్నల్ దగ్గర మాత్రం ఎల్ వి బోర్డున్న పెట్టె కనబడుతోంది "అదేనా, వెళ్ళిపోతున్నట్టుందే!" అన్నాడు, దూరానున్న కూలీతో.

వాడు "ఎల్లిపోతావుందా, అట్టయితే ఇంతేసంగతి. ఎల్లిపోక ఆగుద్దా యేంది, గంటన్నర లేటుగా వచ్చింది.. ఆరున్నర గ్గామాల కోణార్క. దానికెళ్ళండి" అంటూ జయంతి బండి వైపు వెళ్ళిపోయాడు

కొంతలోకొంత ప్రశాంతపడిన సౌభాగ్యరావు మనస్సు మరొకసారి దారుణంగా మూలిగింది ! కాదు, రోదించింది, అతనికి స్పృహ తప్పినంత పనైంది. కనుమరుగయ్యేదాకా ఆ ఎల్.వి బోర్డువైపే చూస్తుండిపోయాడు

అయిదు నిముషాలకి తేరుకున్నాడు గాలి తీసేసిన సైకిల్ టైరు మొహంతో నాలుగడుగులు

వేసాడు చేతిలో అడ్రసుముక్క ఉన్న విషయం జ్ఞాపకం వచ్చింది అతి తీక్షణమైన కసితో దాన్ని ముక్కలు చేసాడు కాదు ముక్కలు, ముక్కలు, ముక్కలు, ముక్కలు, ముక్కలు, చేసాడు. హఠాత్తుగా ఒక ఆలోచనొచ్చింది హిగ్గిన్‌బాథమ్స్ వాణ్ణడిగి బస్‌స్టాండ్ ఎంక్వయిరీస్ నెంబరు సేకరించాడు పబ్లిక్‌కాల్ టెలిఫోన్ దగ్గరికెళ్ళాడు ఆ నెంబరు పిలిచాడు అవతలి పక్క పలికింది అమ్మాయి టక్కున కనెక్షన్ కట్ అయిపోయింది! అతను తెల్లబోయాడు. మళ్ళీ డబ్బేసి మళ్ళీ పిలిచాడు, మళ్ళీ ఆ అమ్మాయి పలికింది, కానీ కట్ అయిపోయింది. యాధాలాపంగా చూట్టంలో గోడమీద అంటించిన 'ఫోను పని చెయ్యటం లేదు' నోటీసు దృష్టిలో పడింది. చిరాగ్గా, అది విరిగిపోయేంత ఫోర్సుతో హాండిల్‌ని క్రెడిల్ మీద రపీమని కొట్టాడు 'ఇంక నిమిషం కూడా వేస్టు చెయ్యకూడదు' అనుకున్నాడు.

గబగబా బ్రిడ్జి దాటాడు. రిక్షాలో బస్ స్టాండు కెళ్ళాడు ఇంకా వెళ్ళలేదు , ఏలూరుకు నాన్-స్టాప్ బస్సు అవుట్‌గేటుగుండా వేగంగా వెళ్ళి పోతూ కనిపించింది.లోపలికెళ్ళి ఎంక్వయిరీలో కనుక్కున్నాడు, మళ్ళీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఎన్నిగంటలకని, " మూడున్నాయి ఒకటి లేట్‌లో ఉంది, ఇంకోటి కాన్సిల్ అయింది.మూడోది ఆరింటికి " అంది అక్కడి అమ్మాయి.

ఎక్కడ కూర్చుని బావురుమని ఏడిస్తే గుండె బరువు తగ్గుతుందో సౌభాగ్యరావుకు అర్థంకాలేదు. అటూ ఇటూ పిచ్చి చూపులు చూస్తూ బెంచీమీద కూలబడ్డాడు. ఒళ్ళో సూట్‌కేస్ పెట్టుకుని, దానిమీద మోచేతులు పెట్టుకుని, అరిచేతుల్లో వంచిన మొహం పెట్టుకుని!

చటుక్కున జ్ఞాపకం వచ్చింది, ఆరుగంటల బస్సుకన్నా ఆరున్నర కోణార్కను నమ్ముకోవటం మంచిదని! ఆ వెంటనే స్ఫురించింది, స్టేషన్‌లో కోణార్కకు ఎప్పుడూ పెద్ద క్యూ ఉంటుందని! టైము చూసుకున్నాడు పావుతక్కువ అయిదు కాళ్లీడ్చుకొంటూ బయట కొచ్చాడు స్టేషనుకు రిక్షా ఎక్కాడు.

కోణార్క ఎక్స్‌ప్రెస్‌లో కూర్చునున్న సౌభాగ్యరావుకి ఆలోచనలొస్తున్నాయి. తను కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో సరాసరి రాలేకపోవటం వల్ల వచ్చిన నష్టం ఎంతంటే, వరంగల్లులో పద్దెనిమిది, బెజవాడలో నాలుగు, సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ తాలూకు అదనపు ఛార్జీ రెండు - మొత్తం ఇరవయినాలుగు రూపాయలు ! దీనికి తోడు ఒక రోజు జీతం నష్టం... తాపీగా ఈ కోణార్కకే తను బయల్దేరుంటే ఇక్కడ ఇరవైరెండూ, సికిందరాబాద్‌లో ఆటోచార్జీ ఆరూ, వెరశి ఇరవై ఎనిమిది రూపాయల డబ్బయినా మిగిలుండేది గదా !

అసలు రేపు ఆఫీసులో అందరిముందరా ఉగ్రనరసింహం తనకు అందివ్వబోయే మెమో మాటేమిటి? ఇంతవరకూ తన జీవితంలో ఎన్నడూ తనకు జరగని అవమానమిది! అన్ని నష్టాలకన్నా ఇది గొప్ప నష్టం! కాదు - క్షోభ! మానమే పోయాక మనిషేమిటింక ... ఇదసలు ఒకరకమైన దరిద్రం... కృష్ణా - జయంతి - పీర్‌లెస్ దరిద్రం. ఇట్లాంటి దరిద్రం నెల కొకటి తగిల్నా చాలు, ఆత్మ విశ్వాసం హరించుకుపోయి హడావుడిగా యాభై ఏళ్ళకే రిటైరయిపోతాడు అభిమానం గలవాడెవడైనా ఛీ! ఛీ!

(పల్లకి సచిత్ర వార పత్రిక జూన్ 19, 1986)

* * *   * * *   * * *